స్కెచ్

# "శాంతిదాత....నిష్పాక్షికుడు"

ద్రోణంరాజు కృష్ణమోహన్

"నా మాట విన్నావా నాన్నా? వద్దన్నకొద్దీ ఆ కాంగ్రెసువాళ్ళ చుట్టూ తిరిగి తిరిగి లేదనిపించుకొచ్చావ్!" విసుగ్గా అన్నాడు కలం క్రిందపెడుతూ మనోహరం.

"ఏదో శక్తికొద్దీ ప్రయత్నించా లాభంలేక పోయింది" పడకకుర్చీలో వాలుతూ అన్నాడు వెంకట్రామయ్య.

"నీ పిచ్చిగాని వాళ్ళెందుకిస్తారు? లక్షలు గడించి, కులాభిమానం రెచ్చగొట్టి, వెనుక కాంగ్రెసు వాళ్ళని బూతులుతిట్టి రౌడీలచేత తన్నించిన సాంబయ్య యీ నాడు కాంగ్రెసు భక్తుడైనాడు దగుల్బాజీలంతా చేరారిందులో ఇప్పుడు" కోపం వెళ్ళగ్రక్కేడు మనోహరం.

"వాళ్ళదే రాజ్యంరా బాబూ. ఏంచేస్తాం! మన రోజులు పోయాయి. ఎన్ని త్యాగాలుచేస్తే మాత్రమేమి, ఎన్ని బాధలు పడితే మాత్ర మేమి? ఊళ్ళో మొట్టమొదట కాంగ్రెసును స్థాపించి, వున్నది కాస్తా అమ్ముకుని దేశభక్తితో అంతా హిందీ ప్రచారానికి, హరిజనోద్ధరణకు ఖర్చుపెట్టి మూడుసార్లు జైళ్లకెళ్ళి ఎన్ని అవస్థలు పడ్డాం! ఈ నాడు మాబోటివాళ్లు యీ కాంగ్రెసువాళ్ళ కంటికే కనిపించం" నిట్టూరుస్తూ అన్నాడు.

"అందుకనే వాళ్ళకి వోట్లెయ్యడం శుష్క దండుగంటాను."

"అలా అనకురా బాబూ. టిక్కెట్లివ్వనంత మాత్రానసంస్థకు దూరమవుతామట్రా." బాధతో అన్నాడు వెంకట్రామయ్య.

"నీ చాదస్తంగాని ఇంకా ఏం కాంగ్రెసు నాన్నా! మట్టి కాంగ్రెసు! మాజీ జమీందార్లు, మిల్లు ప్రొపయిటర్లు, రంగులు మార్చేవాళ్లు అంతా గాంధీ టోపీ పెట్టుకున్నంత మాత్రాన కాంగ్రెసువాళ్ళయ్యారా! నిజంగా జైళ్ళకెళ్ళి త్యాగాలుచేసి బాధలుపడ్డవాళ్ళంతా యీ నాడు సోషలిస్టుపార్టీలోనో కమ్యూనిస్టుపార్టీలోనో చేరి పోయారు, ఎక్కడో చెదురుగాతప్ప."

"అయినా ఎలా వదులుతామురా!" నవ్వు తూన్నట్టుగా అన్నాడు వెంకట్రామయ్య.

"వదలలేవులే నాన్నా ఎలా సాధ్యంనీకు!"

"నిజంరా....ఏదో ఆ కాంగ్రెసువాళ్లని పట్టు కోబట్టేగదా, నీకిమాత్రం కాస్త వందరూపాయల వుద్యోగం వచ్చింది! లేకపోతే నీతోపాటు బి.ఏ. చదివినవారంతా యీ నాడు గట్టిగా నిలకడగల వుద్యోగాలు యిలా సంపాదించారా చెప్పు?" ప్రశ్నించాడు.

"ఓయబ్బ! వీళ్ళిప్పిచ్చకపోతే మాడిపో తామా యేం? ఆ మాత్రం స్వయంగా కష్టపడి సాదించుకోలేమా, యిది కాకపోతే మరో వుద్యోగం మరో చోట!" ఘాటుగా అన్నాడు.

"ఏదో వున్న వూళ్ళో దొరుకుతుందిరా, కడు పులో చల్ల కదలకుండా! లే భోంచేద్దాం.... ఏయ్ వడ్డించు" అంటూ లేచాడు.

"నువ్వేపార్టీకి వోటిస్తావే అమ్మా?" అన్నం దగ్గిర అడిగాడు.

"అదేమిటీ" అని నవ్వి. నెయ్యివేసి "మీ నాన్నదోపార్టీ నాదోపార్టీ అవుతుందా ఏమిట్రా! మొదటినుంచీ కాంగ్రెసేగా మనం" తన మామ గారు కూడా కాంగ్రెసులో ఎలా తిరిగేవాడో చెప్పింది నరసమ్మ

"అసలు యింకో పార్టీ పేరు వినలేదు నువ్వు?" మళ్ళీ అడిగాడు, అమ్మ రాజకీయ చైతన్యం ఏపాటిదో చూదామని

"వినకేంరా. లక్ష పార్టీల పేర్లు విన్నాను. అయితే అడ్డమైన పార్టీకీ వేస్తామా మనం! నాన్న కాంగ్రెసులో పుట్టి పెరిగారు ఇప్పుడు ఎలా దూరమవుతారు."

"నాయనా నీకు తెలియదుగాని ఆ రోజులు" ముద్ద నములుతూ, అరగ్లాసుడు నీళ్ళు త్రాగి

ఆ రోజులు....అప్పుడు! ఆ నాన్‌కో ఆపరేషన్! "ఆ సత్యాగ్రహం! ఆ విదేశీ వస్త్రదహనం! లాఠీదెబ్బలు, వూరేగింపులు! అవన్నీ .... ఒరేయి నిజంగా కళ్ళకు కట్టుతున్నాయిరా! నన్ను పోలీసు వ్యానులో ఎక్కిస్తూంటే మీ తాతయ్య, మీ అమ్మ, బామ్మ, భోరుమంటూంటే .... జనం 'జిందాబాద్' అంటూంటే....పూలమాలలు విసురుతూంటే... దేశంకోసం గాంధీగారి నాయకత్వంలో.."ఇంకా చెప్పకుపోతున్నాడు వెంకట్రామయ్య. పొంగిపోతున్నాడు. దేహం పులకితమైనది. ఎంతో ఆవేశంతో వుత్సాహంతో మాట్లాడుతున్నాడు. కంచంలో అన్నం అలాగే వున్నది.

"తినండి తినండి ఎందుకా రోజులు తల్చుకుని!" గుర్తుచేసింది యీ ప్రపంచాన్ని కాస్త నరసమ్మ.

"నువ్వుచెప్పేది నిజమే నాన్నా కాదనను. కాని రోజులు మారాయి. అలా త్యాగాలు చేసినవారిలో బహు కొద్దిమందే యీ నాడు కాంగ్రెసులో వున్నారు."

"అయితే ఏంరా బాబూ! పెద్దవాళ్ళంతా గతిస్తున్నారు. గాంధీ, బోసుబాబు, పటేల్, తిలక్, దాసు,సరోజినినాయుడు, అంతా వెళ్ళిపోయారు ఒక్క మహాపురుషు డున్నాడురా! ఒక్కడే ఒక్క మనిషి! తలమానికం! మన నెహ్రూ! ప్రపంచానికే నాయకుడు ఆయనగారు వున్నంతకాలం ఏం పరవాలేదు,కాంగ్రెసుకుగాని దేశానికిగాని!" సగర్వంగా చెప్పాడు వెంకట్రామయ్య.

"ఇలాంటి సాంబయ్యలంతా నెహ్రూ తరువాత ఆయన విధానాల్ని తు.చ. తప్పకుండా అమలుపరుస్తారనేనా నీ నమ్మకం?" చెయ్యి కడుక్కుంటూ లేచాడు

కమ్యూనిస్టుల పేరు వింటేనే మంట. వాళ్ల మూఢ నమ్మకాలు, రష్యామీద అచంచల విశ్వాసం, జాతీయ నాయకులన్నా జాతీయతన్నా ఏ మాత్రం అభిమానం లేకపోవడం, పోలెండు, హంగరీ, కృశ్చేవ్ నివేదిక, ఇత్యాది విషయాలన్నీ తల్చుకుంటుంటే వాళ్ళమీద చెడ్డ అసహ్యమేస్తూంటుంది ఇటు కాంగ్రెసును చూద్దామా అంటే 200 ఎకరాల భూస్వామి, ఏనాడూ కాంగ్రెసులో లేని, ఇదివరకు కాంగ్రెసుకు వ్యతిరేకంగా పోటీచేసి కొద్దిలో వోడిపోయిన సాంబయ్య! ఇలాంటి సాంబయ్యలు చాలామంది మెల్లగా జేరుతున్నారు కాంగ్రెసులో. చూస్తూ చూస్తూ ఎలా వోటు వేస్తాడు! వెయ్యమని తన క్రొత్త వోటరు స్నేహితులకెలా చెపుతాడు! మూడోవాడు సోషలిస్టు! "నన్ను ముట్టుకోకు" అనే సిద్ధాంతం. స్థూలంగా వాళ్ల పాలసీ బాగానే వున్నది. ఏ పార్టీనుంచి అయినా టిక్కెట్ దొరకక్క ఇవతలకొస్తే వాళ్ళని సపోర్టు చెయ్యరు. కాబట్టి నిజాయితీ, నీతి కొంతవరకయినా వీళ్ళల్లో వున్నది. కమ్యూనిస్టులలాగ అర్థమైన వాళ్ళతో కలవరు, నీతి నియమాలు లేకుండా....కనుక వేస్తే పోనీ వీళ్ళకే వేసి వూరుకుంటే. లేకపోతే వాళ్ళు చెప్పినట్లు అసలే ఊరుకుంటే, ఎవరికి వెయ్యకుండా! వేసినంత మాత్రాన గెలుస్తారా! అనుకోకుండా వందల కొద్దీ సీట్లు వచ్చిపడితే వీళ్లు కూడా ఇలాగే మిడిసిపడరుగదా! ఏమో! అయినా ఎక్కడికి పోతారు! ఇది డెమాక్రసీ! తుడిచిపెట్టెయ్యొచ్చు కావలిస్తే....

కన్ను మూత పడుతోంది కొద్ది కొద్దిగా. చిత్తరంజన్‌నుంచి పెరంబూరు దాకా రయ్ మని పట్టాలమీద టకటక చప్పుడు చేసుకుంటూ వచ్చిందొక క్రొత్త ఇంజన్! భాక్రా, నాగార్జున, కోసీ, దామోదర, హీరాకుడ్‌ల తూముల రొదలు, జలపాత్రపు హోరులు వినిపిస్తున్నాయి. సింద్రీ భుగభుగలు కనిపిస్తున్నాయి. ఖండక్ వాస్లానుంచి సైనిక కవాతు, బెంగుళూరు నుంచి హెచ్-ఒ విమానపు ధ్వని, రష్యా చైనాలనుంచి "శాంతి దూత....నిష్కాకుడు" జోహార్లు, అన్నీ వినవస్తున్నాయి.... చెవులు గింగుర్లెత్తిపోతున్నాయి. కళ్ళముందు అంతా ఏదో నాట్యంలా కనిపిస్తోంది.

కళ్ళు తెరిచేసరికి నాన్న గోవిందనామాలు వినిపించాయి తెల్లవారుతోంది. లేచాడు.

"ఏరా! నిద్రపోలేదా ఏమిటీ! నీ ఎలెక్షన్ పాడుగాను" పాట ఆపి, కొడుకు కళ్ళు చూసి అడిగాడు వెంకట్రామయ్య. ★